క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పంతులు

బిక్కవోలు: తోస్సిపూడిలో రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయం వద్ద తృతీయ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణం నిర్వహించారు. అర్చకులు రామచంద్రప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నల్లమిల్లి మణిధర్‌రెడ్డి, భాగలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు. విశేషంగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వాలీబాల్ విజేత సీతానగరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని స్వర్గీయ శ్రీ మార్ని వెంకన్న చౌదరి మెమోరియల్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో సీతానగరం జట్టు విజేతగా నిలిచింది. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో 8 ఎనిమిది జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో ఫైనల్‌లో ఊలపల్లి, సీతానగరం జట్లు పోటీ పడగా వారిలో విజేత సీతానగరం, రన్నర్‌గా ఊలపల్లి నిలిచాయి. అనంతరం గెలిపొందిన వారి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలోని గ్రామ ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...కామరాజుపేట గ్రామానికి చెందిన బలిరెడ్డి వెంకటరమణ (40)ను ఆదివారం తెల్లవారుజామున ఎల్లం చెరువు దగ్గరలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. దీనిపై ఏఎస్‌ఐ రాంబాబునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాడాల హెచ్‌ఎం జ్యోతికుమారికి సత్కారం



జ్యోతికుమారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీటీఐ ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల కాంప్లెక్స్ (పాఠశాలల సముదాయం)హెచ్‌ఎం ఎస్ఎన్ జ్యోతికుమారిని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జ్యోతికుమారి అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం పెద గెద్దాడ హైస్కూల్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అసోసియేషన్ నాయకులు కలిశారు. ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ కె.జాకబ్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి మంగాదేవి పాల్గొన్నారు.

నేడు జేవీకే కిట్ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ టి.కువలవ దొర తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు కడియాల పాపారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశులు నాగేశ్వరరావు పాల్గొంటారన్నారు.

మాజీ ఎంపీ హర్షకుమార్ తనయుడి అరెస్టు

మధురపూడి: మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్‌ను ఆదివారం కోరుకొండ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో జరిగిన అంబేడ్కర్ విగ్రహం వివాదం విషయమై శ్రీరాజ్ వెళ్లి, అక్కడి ప్రజలను రెచ్చగొట్టాడు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి వాతావరణాన్ని చల్లార్చారు. ఈ సందర్భంగా శ్రీరాజ్‌ను అదుపులోకి తీసుకుని, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

విద్యా కానుక.. అందుకోండిక..

- పాఠశాలలకు చేరిన జగనన్న విద్యా కానుక కిట్లు
- పంపిణీకి ఏర్పాట్లు చేసిన అధికారులు



విద్యార్థులకు పంపిణీ చేయనున్న జగనన్న కిట్లు



పందలపాకలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న పుస్తకాలు

బిక్కవోలు: జగనన్న విద్యాకానుక కిట్లు పాఠశాలల్లో సిద్ధంగా ఉన్నాయి. విద్యార్థులకు అందించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే రోజే కానుకలు అందించనున్నారు. ఇప్పటికే విద్యాకానుక కిట్లలో ఉండే వస్తువులను పాఠశాల చేరవేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నారు. నాడు– నేడులో భాగంగా కోట్లది రూపాయాలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి తొమ్మిదో తరగతి సిలబస్‌లో మార్పులు చేసి, ఎన్‌సీ ఈఆర్‌టీ స్థాయి పుస్తకాలను అందించనున్నారు. విద్యార్థులకు విద్యాకానుక పేరుతో పాఠ్య పుస్తకాలే కాకుండా బ్యాగు, బూట్లు, బెల్ట్, రెండు జతల సాక్సులు, నోట్లు పుస్తకాలు, యూనిఫారం, టై, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను సిద్ధం చేశారు. నియోజకవర్గంలో సుమారుగా 21 వేల మంది విద్యార్థులకు ఈ కిట్లు అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

తప్పిన ఆర్థిక భారం

పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయంటే తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువుల కొనుగోలుకు వేలల్లోనే ఖర్చు అవుతుంది. అది పేద కుటుంబాలకు భారంగా ఉండేది. ఇప్పుడు బెంగ లేదు. నోటి పుస్తకాలతోపాటు, యూనిఫారం తదితర సామగ్రి ప్రభుత్వమే ఇస్తోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గించింది. ప్రతి సంవత్సరం జగనన్న కానుకను ఉచితంగా అందిస్తోంది. అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో కానుక కిట్ల రూపంలో అందుతుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల గురించి భయం లేదు



పిల్లలను చదివించాలంటే భయపడే రోజులు పోయాయి. జగనన్న ముఖ్యమంత్రిగా ఉండగా ఏ తల్లిదండ్రులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. విద్యా కానుక అందిస్తున్నారు. అమ్మఒడి ఇస్తున్నారు. పిల్లలకు పోషకాహారం ఇస్తున్నారు. బడుల్లో సౌకర్యాలు పెంచారు. చాలా సంతోషంగా ఉంది.

– గొర్రిపోటి వెంకటలక్ష్మి, విద్యార్థులు తల్లి, పందలపాక

అన్ని ఏర్పాట్లూ చేశాం



జగనన్న విద్యాకానుక కిట్లు పాఠశాలకు వచ్చాయి. సోమవారం విద్యార్థులు అందించే అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. తొలి రోజే ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశం ప్రకారం విద్యార్థులకు ఇస్తాం.

– సీహెచ్ సోమిరెడ్డి హెచ్‌ఎం, పందలపాక ఉన్నత పాఠశాల

స్కూళ్లకు కిట్లు



ప్రభుత్వం, పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుకలను అందించనున్నాం. ఇప్పటికే కిట్లు స్కూళ్లకు చేరాయి.పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు అందిస్తాం.

– కె.శ్రీనివాసరావు, బిక్కవోలు, రంగంపేట మండలాల ఎంఈఓ.

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, వ్రతాలు ఆచరించారు.

21న మండల సమావేశం

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ సమావేశానికి గత మూడు నెలలలో జరిగిన ప్రగతిపై చర్చ ఉంటుందని, అధికారులు తదితరులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

మధురపూడి: అధిక ఉష్ణోగ్రతల కారణంగా సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకూ ఒంటిపూట బడులు నిర్వహిస్తామని ఎంఈఓ టి.కుశలవదొర తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకూ పాఠశాలలు జరుగుతాయన్నారు.

నవరత్నాలతో పేదల అభ్యున్నతి



ముగ్గళ్లలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముగ్గళ్లలో గడప గడపకూ మన ప్రభుత్వం

సీతానగరం: నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ముగ్గళ్లలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేసిన లబ్ధిని బుక్‌లెట్‌ల ద్వారా వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల ప్రయోజనం నేరుగా లబ్ధిదారుల బ్యాంకుఖాతాలకు జమ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాదె చంటిబాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, రుద్రం వీరేంద్ర, రుద్రం వెంకన్న, బొమ్ముల రాంబాబు, మన్యం నాని, కూచిపూడి బాబ్జీ, ఎంపీడీవో కె.రమేష్ పాల్గొన్నారు.

నిప్పుల కుంపటి

సీతానగరం: ఇంట్లో ఉక్కపోత, బయట ఎండ మోత, ఉదయం తొమ్మిదింటికే సుర్రుమంటున్న సూరీడు, వడగాల్పులకు తాళలేక కాలు బయటపెట్టలేని పరిస్థితి. ఇదీ కొన్ని రోజులుగా భానుడి విశ్వరూపం. పగలు 37 నుంచి 42 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం సీతానగరంలో 42 డిగ్రీలు, ఆదివారం అత్యధికంగా 43 డిగ్రీలు నమోదైంది. సీతానగరం, రఘుదేవపురం సెంటర్లు జనసంచారం లేక వెలవెలబోయాయి. ఎండ నేపథ్యంలో ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. కాగా.. ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, ఓఆర్ఎస్, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని సూచి స్తున్నారు.



సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో తగ్గిన జనసంచారం

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వినతిపత్రం అందజేసిన పార్ట్‌టైం అధ్యాపకులు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిసిన ఎయిడెడ్ కళాశాలల అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలోని వివిధ ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడెడ్ కళాశాల పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ సభ్యులు కలిశారు. వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఎయిడెడ్ కళాశాలల్లో 25 నుంచి 30 ఏళ్లగా పనిచేస్తున్నామన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గవర్నమెంట్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారమే తమ సేవలను గుర్తించి క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించే విధంగా బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే రాజాను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు విల్లా రాజ్ కుమార్, సెక్రటరీ సంజీవరావు, జాయింట్ సెక్రటరీ విల్లా లక్ష్మి, డి.శ్రీనివాస్, కోశాధికారి సుందర రామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

- విద్యార్థులకు బహుమతుల ప్రదానం



రంగంపేటలో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు



సీతానగరంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు



పెదపూడిలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో జనార్దన్‌స్వామి, వర్ధన్ తదితరులు



రాజానగరంలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

రంగంపేట: విద్యార్థుల కోసం గ్రంథాలయాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిశాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి గ్రంథాలయ సీనియర్ పాఠకులు వి.మాణిక్యం, సామాజిక వేత్త మండవిల్లి గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించే లక్ష్యంతో ఈ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించడం గొప్ప విషయ మన్నారు. పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చు అన్నారు. లైబ్రేరియన్ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ విజ్ఞాన వికాసానికి, మనో వికాసానికి గ్రంథాలయాలు జ్ఞాన నేత్రాలుగా దోహదపడతాయన్నారు. అనంతరం గత 35 రోజులుగా రాయడం, కథలు చెప్పడం, చిత్ర లేఖనం, స్పోకెన్ ఇంగ్లీషు, తెలుగు వ్యాకరణం, బాలల గేయాలు పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన రీసోర్స్ పర్సన్లను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల కొండయ్య, షేక్ వలీ, కె.దుర్గాప్రసాద్, మేడిశెట్టి సాయి శ్రీనివాస్, పీవీ ప్రసాద్, నాగేంద్ర, అంజలి పాల్గొన్నారు.

పెదపూడిలో...

పెదపూడి: గ్రంథాలయాల నుంచి నెల రోజులుగా విద్యార్థులు వివిధ విభాగాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ పూర్తి చేయడం అభినందనీయమని ప్రముఖ న్యాయవాది, విశ్రాంత ఉపాధ్యాయుడు తిప్పాన జనార్దన్ స్వామి అన్నారు. పెదపూడి గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించి శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ స్వామి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు సాధించాలన్నారు. అనంతరం 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వర్ధన్, సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ మెంబర్ కోరా వీర్రాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో...

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రంథాలయంలో గతనెల 8న ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకల్లో ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు, బి.జ్యోతి ముఖ్య అతిథులు విచ్చేశారు. ఉపాధ్యాయులు ఎస్కే నగీషా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, కలర్ పేపర్స్‌తో క్రాఫ్ట్ వర్క్, వ్యాసరచన, క్విజ్ తదితర వాటిలో విజేతలకు బహుమతులు అందజేశారు.

రాజానగరంలో..

రాజానగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో 35 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ శిక్షణలో విద్యార్థులకు నీతి పద్యాలు నేర్పించడం, చెప్పించడం, తెలుగు పదాలు నేర్పించడం, పేపరుతో క్రాఫ్ట్ (బొమ్మలు, ఇతర వస్తువులు) తయారీ, చిన్నపిల్లలకు తెలుగు అక్షరాలు నేర్పించడం చేయించారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాలకు రీసోర్సుపర్సన్లుగా పి.భారతి, బి.నాగలక్ష్మి వ్యవహరించారని లైబ్రేరియన్ కె.సత్యనారాయణ తెలిపారు.

చాగల్నాడు కాలువకు మోక్షం ఎప్పుడు?

- కాలువను పూడ్చివేసిన ఓ రైతు
- మిగిలిన పొలాలకు నీరందని పరిస్థితి



నాయకంపల్లి వద్ద చాగల్నాడు కాలువ (పూడ్చక ముందు)



కాలువను పూడ్చివేసిన తర్వాత..

రంగంపేట: రంగంపేట – గండేపల్లి మండలాల పరిధిలో కిలో మీటరు పొడవున, 20 మీటర్లు వెడల్పున చాగల్నాడు ఎత్తిపోతల పథకం పంటకాలువ మాయమై ఆరు నెలలు దాటి పోయింది. ఇప్పటికీ ఈ కాలువను పునరుద్ధరించకపోవడంపై ఐదు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. జలవనరుల శాఖ ఈనెల 15వ తేదీన చాగల్నాడు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల చేయడానికి షెడ్యూల్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు నీరు ఎలా అందుతుందని రంగంపేట మండల పరిధిలోని మర్రిపూడి, దొడ్డిగుంట, సింగంపల్లి, వెంకటాపురం, పెదరాయవరం రైతులతో పాటు గండేపల్లి మండలానికి చెందిన నాయకంపల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు.

కాలువ పూడ్చివేత

రెండు దశాబ్దాల క్రితం రంగంపేట మండలంలోని సుమారు 14 వేల ఎకరాలకు నీరు అందించడానికి గోదావరి ఒడ్డున కాతేరు వద్ద చాగల్నాడు పంపు హౌస్ నిర్మించారు. దీనికి అనుబంధంగా పాలచర్ల వద్ద మరో పంపుహౌస్ కట్టి కాలువ ద్వారా నీరు అందజేస్తున్నారు. రంగంపేట మండల రైతుల ప్రయోజనం కోసం మండలంలోని వడిశలేరు నుంచి మర్రిపూడి వరకు 21 కిలో మీటర్ల పొడవున కాలువ తవ్వారు. ఈ కాలువను ఈ ఏడాది ప్రారంభంలో ఒక రైతు పెదరాయవరం సమీపంలో కిలో మీటరు పొడవున పూడ్చివేసి పంటభూమిగా మార్చివేశారు. దీనివల్ల కాలువకు అటువైపు ఉన్న ఐదు గ్రామాలకు చెందిన ఐదు వేల ఎకరాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడింది.

రంగంలోకి రెవెన్యూ శాఖ

ఇరవై ఏళ్లుగా నీరందిస్తున్న చాగల్నాడు పంట కాలువ రాత్రికి రాత్రి మాయం కావడంపై మండిపడిన రైతులు ఈ విషయాన్ని చాగల్నాడు ఎత్తి పోతల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు ఈ విషయాన్ని ఇటు తూర్పుగోదావరి కలెక్టర్‌తోపాటు అటు కాకినాడ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు చిన్న సాంకేతిక సమస్యను అడ్డుపెట్టుకుని ఒక రైతు ఈ కాలువ పూడ్చి వేతకు పాల్పడినట్లు గుర్తించారు. కాలువ పూడ్చివేత తొలగించాలని నోటీసులు ఇచ్చారు. అయితే ఆ రైతు పంట కాలువ భూమిని మరొకరికి గిఫ్టుగా రాసి ఇచ్చేసి జాప్యానికి కారణమవుతున్నట్లు తెలిసింది. దీనిని తిప్పికొట్టి ఈనెల 20 నాటికి కాలువను కచ్చితంగా పునరుద్ధరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చినట్లు మర్రిపూడి గ్రామ రైతు పుట్టా సోమన్న చౌదరి తెలిపారు.

వైభవంగా వజ్రగణపతి ఆలయ వార్షికోత్సవం



స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 23వ డివిజన్ పరిధిలోని నందివాడ వారి వీధిలో కొలువైన వజ్రగణపతి ఆలయం తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, చందా సత్రం మాజీ చైర్మన్ వాకచర్ల కృష్ణ, సూర్యకుమారి దంపతులు, యతిరాజు సంపత్ కుమార్, రేణుక దంపతులు వజ్ర గణపతికి 18 రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పేరూరి మహేంద్రనాథ్, సరిదే ధన వెంకటేశ్వరరావు, మాడడుగుల సుబ్బయ్య, సోమిశెట్టి భీమేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, గొల్లపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.